క్లుప్తంగా

ఎంపీడీఓను కలిసి ఎంపీటీసీలు



ప్రత్తిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కొందరు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు ఎంపీడీఓ కె.శివపార్వతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడుకు వచ్చిన ఎంపీడీఓను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కలిసిన వారిలో ఎంపీటీసీలు గురుగూరి సాయి, మేరుగు సుభాషిణి, బూసి సువార్తమ్మ, సురేష్, మాణిక్యరావులు ఉన్నారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ వేల్పుల నాగిరెడ్డికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ నోవెల్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ క్లాసిఫికేషన్ అండ్ సెగ్మెంటేషన్ ఆఫ్ బ్రెస్ట్ టూమర్స్ బై యూజింగ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్' అనే అంశంపై నాగిరెడ్డి చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ అందజేశారు. పీహెచ్‌డీ పట్టాపొందిన నాగిరెడ్డిని పలువురు అభినందించారు.

డైమండ్ బాబుకు అభినందనలు



పొన్నూరు: వైఎస్సార్ సీపీ గుంటూరు నగర అధ్యక్షుడిగా నియమితులైన నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్ర బాబు(డైమండ్ బాబు)కు వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అభినందనలు తెలిపారు. గుంటూరులోని ఆయన కార్యాలయంలో డైమండ్ బాబుకు మురళీకృష్ణ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీలు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ఇంచార్జ్) డి.శ్రీనివాస్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. మొత్తం 34 ఫిర్యాదులు అందాయని, వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 13, ఇంజినీరింగ్ విభాగం 11, రెవెన్యూ 3, ప్రజారోగ్య విభాగం 5, అకౌంట్స్ 1, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున ఫిర్యాదులు వచ్చాయని, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, మేనేజర్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఆర్‌ఓలు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతరు



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి దందాకు ఇంజినీరింగ్ అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఒక పక్క నగర కమిషనర్ పులి శ్రీనివాసులు వాటర్ ట్యాంకులను భవన నిర్మాణాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినప్పటికీ ఇంజినీరింగ్ అధికారులు కమిషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నారు. రోజుకు లక్షలాది లీటర్ల మంచినీరు అక్రమంగా ట్యాంకుల ద్వారా తరలించి భవన నిర్మాణాలకు, కమర్షియల్ పనులకు వినియోగించుకుంటూ వేల రూపాయలను తమ జేబుల్లో వేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకర్ల దోపిడీని అరికట్టాలని నగర వాసులు కోరుతున్నారు.

సమస్యలు పదిలం.. పరిష్కారంలో విఫలం

పొన్నూరు: పట్టణంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి అవి పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోతున్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారని వాపోతున్నారు.

రక్షిత తాగునీరు కరువు

నిడుబ్రోలులో కుళాయి ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితమై పచ్చ రంగులో వస్తుండటంతో జనం అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులకు మాత్రం పట్టడం లేదు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇప్పటికే పట్టణంలో జ్వరం, ఇతర వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఈ కలుషిత జలంతో మరిన్ని రోగాల బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



పచ్చ రంగులో సరఫరా అయిన కుళాయి నీరు

అల్లుకున్న పొదలు

పట్టణంలోని శాంతినగర్‌లో విద్యుత్ వైర్లకు చెట్ల పొదలు అలుముకున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మరోవైపు పొదల వల్ల విద్యుత్ అంతరాయం ఏర్పడుతోందని వినియోగదారులు అంటున్నారు. అధికారులు స్పందించి వైర్లకు ఉన్న చెట్ల తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



శాంతినగర్‌లో వైర్లకు అలుముకున్న చెట్ల పొదలు

రైతు బజార్‌లో పనిచేయని ఎలక్ట్రిక్ డిస్‌ప్లే

రైతు బజార్ నిర్వహణ లక్ష్యాలకు అనుగుణంగా లేదు. కూరగాయల ధరలను తెలియజేసే ఎల్‌ఈడీ డిస్‌ప్లే కొంతకాలంగా వినియోగంలో లేదు. దీంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులకు కూరగాయల ధరలను తెలియక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుంటే, రైతు బజార్‌లో నిర్ణయించే ధరలు తెలియక కొనుగోలుదారులు సతమతమవుతున్నారు.



పట్టింపులేని పారిశుద్ధ్యం



తహసీల్దార్ కార్యాలయంలో చెత్త

మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో రోజుల తరబడి చెల్లవ నిల్వ చేరి అధ్వానంగా మారింది. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే ప్రజలు దుర్వాసన వెదజల్లుతుండటంతో అవస్థలు పడుతున్నారు. శానిటేషన్ సిబ్బంది స్పందించి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించాలి

ఎంపీడీఓ కె. శివపార్వతి

ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఎంపీడీఓ కె.శివపార్వతి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీల ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీఓ కె.శివపార్వతిలు ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పాలకవర్గాలు పంచాయతీ అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్ షేక్ ఖాజా పంచాయతీల పరిపాలన, నిధుల వినియోగం, నిధుల లభ్యత, స్వంత వనరులతో ఆదాయం సమకూర్చుకునే పద్ధతులు, పారిశుద్ధ్య నిర్వహణ, నీటి సరఫరా, విద్యుత్ దీపాల మెయింటెనెన్స్ వంటి అనేక విషయాలపై శిక్షణ ఇచ్చారు. ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీఓ కె.శివపార్వతి

సీఐఎఫ్ రికవరీ వందశాతం ఉండాలి

వెలుగు ఏపీఎం వి.లాజరు

ప్రత్తిపాడు: సీఐఎఫ్ రికవరీ వందకు వందశాతం కచ్చితంగా ఉండాల్సిందేనని వెలుగు ఏపీఎం వి.లాజరు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వీఓఏలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో 1246 గ్రూపులు ఉంటే వాటిలో 176 గ్రూపులు ఎన్‌పీఏలో ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుందన్నారు. వెంటనే గ్రూపులను ఎన్‌పీఏ నుంచి బయటకు తీసుకురావాలని వీఓఏలను ఆదేశించారు. అదేవిధంగా స్త్రీ నిధి రికవరీ, ఉన్నతి రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీవోఏలందరూ ప్రతి నెల రూ. 5లక్షలకు మించి స్త్రీ నిధి రుణాలను ఇవ్వాలని సూచించారు. వీవోఏలపై అనేక రకాల అవినీతి ఆరోపణలు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఇకపై ఫిర్యాదులు వస్తే ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. వీవోఏలు సభ్యులుగా ఉన్న గ్రూపులన్నీ తప్పనిసరిగా ఏ గ్రేడులో ఉండాల్సిందేనని వివరించారు. పేద మహిళలను ఆర్థికాభివృద్ధి వైపు నడిపించాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందేనని తెలిపారు. మండలంలో వీవోఏలుగా పనిచేస్తున్న వారంతా తమ పదవ తరగతి విద్యార్హత సర్టిఫికెట్లు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సీసీలు, ఓబీ సభ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం వి.లాజరు

ఆదిపరాశక్తికి నీరజనాలు



గంగాపార్వతీసమేత దండేశ్వరాలయంలో చండికాదేవి అవతారంలో పార్వతీదేవి



వేణుగోపాలస్వామి ఆలయంలో లలితాదేవిగా దర్శనమిస్తున్న రాజ్యలక్ష్మి అమ్మవారు



రజక రామాలయం వద్ద విశేష పూజలందుకున్న దుర్గాదేవి




పెదకాకాని శివాలయంలో కదంబ వనవాసినిదేవిగా భ్రమరాంబ అమ్మవారు




రైలుపేట అభయ వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి అలంకారం



చేబ్రోలులో నాగేశ్వరస్వామి దేవస్థానంలో వనబాలాదేవి అలంకారం



కొండపాటూరులో మహాచండీ దేవిగా అమ్మవారు



నల్లపాడు అగస్త్యేశ్వరాలయంలో శ్రీపార్వతీదేవిగా అమ్మవారు



రైలు పేట రెల్లి కమిటీ ఆధ్వర్యంలో



చల్లావారిపాలెం పుట్టలమ్మతల్లి ఆలయంలో మీనాక్షిదేవిగా అమ్మవారు

దేవీశరన్నవరాత్రులు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. లోకమాత జగజ్జనని భక్తుల నుంచి విశేష పూజలందుకుంటుంది. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన సోమవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

– ప్రత్తిపాడు, కాకుమాను/ పొన్నూరు/పెదకాకాని/ గుంటూరు రూరల్/చేబ్రోలు



చేబ్రోలు మండలం మంచాల గ్రామంలో చండీ హోమంలో భక్తులు

చిరు వ్యాపారులను కొనసాగించాలి

లక్ష్మీపురం: అనేక సంవత్సరాలుగా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ, ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులు, వారి సహాయకులకు తక్కువ ధరలో తినుబండారాలను సప్లయి చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న వారి పొట్టకొట్టడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కోట మాల్యాద్రి అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో చిరువ్యాపారులు, ఏఐటీయూసీ సంఘం ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దుపాటి వెంకటరత్నం, నరసింహారావు, చల్లా మరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బాలల పార్లమెంట్‌కు జేఎంజే విద్యార్థులు



జాతీయ స్థాయి బాలల పార్లమెంట్‌లో పాల్గొన్న బాలబాలికలు

గుంటూరు రూరల్: మధ్యప్రదేశ్‌లోని భోపాల్ నందు జరిగిన జాతీయస్థాయి బాలల పార్లమెంట్ సమావేశాల్లో జేఎంజే సాంఘిక సేవా సంస్థ నుంచి పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొనటం జరిగిందని సంస్థ డైరెక్టర్ రెవరెండ్ సిస్టర్ మేరికుమారి తెలిపారు. సోమవారం నల్లపాడు గ్రామంలోని జేఎంజే సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగిన బాలల పార్లమెంట్‌లో సంస్థ నుంచి జిల్లాలోని అంగలకుదురు జిల్లా పరిషత్ హైస్కూల్‌నుంచి, పల్నాడు జిల్లా దుర్గిలోని సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 3 వరకు జరిగిన ఈ సమావేశాల్లో 100 మంది బాల బాలికలు, 30 మంది కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారన్నారు. ఈ సమావేశాల్లో బాలలు బాలల హక్కులు, బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారాలకోసం ఏంచేయాలి అనే విషయాలపై చర్చించారన్నారు. ఈ సమావేశంలో భాగంగా ఎన్నికలు నిర్వహించగా జేఎంజే సంస్థనుంచి వెళ్ళిన వారిలో హోం మినిస్టర్‌గా సిరి లతారెడ్డి, సీనియర్ సిటిజన్ మినిస్టర్‌గా మహేష్‌లు ఎన్నికయ్యారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తదితరులున్నారు.

విద్వేష, విభజన రాజకీయాలను తిప్పికొట్టాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

చేబ్రోలు: బీజేపీ విద్వేషపు, విభజన రాజకీయాలను తిప్పి కొట్టాల్సిన అవసరం ప్రజలపై ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. సీపీఎం చేబ్రోలు శాఖా మహాసభ సీహెచ్ హనుమంతరావు అధ్యక్షతన చేబ్రోలులోని ఉపాధ్యాయ భవన్‌లో సోమవారం జరిగింది. సీపీఎం ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం పోరాడే పార్టీ సీపీఎం అని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయడంలోనూ, నిరుద్యోగాన్ని తగ్గించే దానిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ఐక్య పోరాటాల ద్వారానే బీజేపీని ఓడించగలమన్నారు. సీపీఎం జిల్లా నాయకుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వరదలు కారణంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వడంలో రాజకీయ జోక్యం సరికాదని అన్నారు. చేబ్రోలు మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, కొత్త రెడ్డిపాలెం వరద ముంపునకు గురైన బాధితులకు పరిహారం అందించాలన్నారు. నూతనంగా చేబ్రోలు మండలశాఖ కార్యదర్శిగా పల్లా ఆదిశేషుని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ప్రకటించారు. స్థానిక సీపీఎం నాయకులు పాల్గొన్నారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

కొనసాగుతున్న బియ్యం అక్రమ రవాణా

పట్టించుకోని అధికారులు

పొన్నూరు: పొన్నూరులో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. వాహనాల్లో టన్నుల కొద్దీ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిఘా ఉంచి దాడులు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు మండలంలోని పలు గ్రామాలనే అడ్డాగా చేసుకుని రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారు.

తక్కువ ధరకు కొని.. అక్రమ రవాణా

పేదలకు పంపిణీ చేయాల్సిన చౌకబియ్యం పక్కదారి పడుతోంది. కార్డుదారుల నుంచి దుకాణాల నిర్వాహకులు, తరలింపుదారులు తక్కువ ధరలకు బియ్యం కొనుగోలు చేసి అక్రమార్కులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో భారీ ఎత్తున అక్రమ రవాణా జరుగుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడో ఒకసారి తనిఖీలు నిర్వహించి.. చేతులు దులుపుకుంటున్నారు. సమాచారం ఇచ్చిన సమయాల్లో మాత్రమే మమ అనిపిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో తనిఖీలు లేకపోవడంతో తరలింపుదారులు యథేచ్ఛగా తమపని కానిస్తున్నారు. మండల రెవెన్యూ వ్యవస్థలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ కొరవడటంతో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డు అదుపులేకుండా జోరుగా సాగుతోంది.



చింతలపూడిలో పట్టుకున్న లారీ(ఫైల్)

నిరంతరం కొరవడిన పర్యవేక్షణ..

మండలంలోని పలు గ్రామాలను అక్రమ రవాణాకు అడ్డాలుగా పెట్టుకొని రేషన్ బియ్యం యథేచ్ఛగా తరలిస్తున్నారు. వారం రోజుల్లో టన్నుల కొద్దీ రేషన్ బియ్యంను పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల ఉప్పరపాలెం నుంచి ఆటోలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం లారీని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చింతలపూడిలో లారీని పోలీసులు పట్టుకుని 800 బస్తాల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. బ్రాహ్మణ కోడూరు గ్రామ సమీపంలో శనివారం ఆటోలో తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యంను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇటీవల అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నాం. నిరంతరం నిఘా ఏర్పాటు చేసి రేషన్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటాం.

–కోటేశ్వరరావు, రూరల్ సీఐ, పొన్నూరు

భారత దేశ చరిత్ర పుస్తకావిష్కరణ



నీలిమను సత్కరిస్తున్న డాక్టర్ కత్తి పద్మారావు

పొన్నూరు: పట్టణంలోని లుంబినీవనం అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు వ్యక్తిత్వ నిర్మాణ శాస్త్రం గురించి వివరించారు. ప్రతి మనిషిలో నిగూఢమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానికి అధ్యయన శక్తి, సృజనాత్మక శక్తి, భాషా సౌందర్యం తోడైతే మంచి రచయితలుగా తయారవుతారని చెప్పారు. ఈ సందర్భంగా 'భారతదేశ చరిత్ర' ఐదో భాగాన్ని లోకాయత పబ్లికేషన్స్ ఎడిటోరియల్ బోర్డు మెంబర్ బత్తుల నీలిమ ఆవిష్కరించారు. డాక్టర్ కత్తి పద్మారావు బత్తుల నీలిమను సత్కరించారు. దాసరి శ్యామల, గేరా ప్రసన్న కుమారి, దాసరి శ్యామల పాల్గొన్నారు.